# సీత జడ

రైలు ఆగీ ఆగటం, పుట్టింటి ఉత్సాహంతో-తణుకు ప్లాట్‌ఫాం మీదికి బంతిలా గెంతింది సీత. "అది డన్‌లప్ పరుపు కాదు. రైల్వే ప్లాట్‌ఫాం" అని వెక్కిరించాడు జానకిరామారావు. స్టీలు మరచెంబు చేత్తో పట్టుకుని సంతోషంగా రంగుల బొంగరంలా తిరుగుతున్న పెళ్ళాన్ని.

"విహరించటానికిది సరోవరమనుకుంటున్నావేమో" అని సన్నాయి నొక్కులు నొక్కాడతను. బానిసలా అణగిమణిగి పడుండవలసిన ఆడది రాణీలా ఠీవిగా వుంటే కొద్దిమంది మగాళ్ళు మాత్రమే సర్దుకుపోగ(లు. సహించి వూరుకోగ(లు. ముందుకెళ్తే ముందుకీ, వెనక్కు వెళ్తే వెనక్కీ వచ్చి పడుతున్న జడను విసరికొట్టి సామాను దింపిస్తున్న మొగుడికేసి అదోలా చూసింది. గొప్పింటి స్త్రీని ప్రాణాలకు తెగించి అనుసరించి వెళ్లే బానిస ప్రియుడిలాగున్నాడు. కాని అత్తారింటికి పెళ్ళాన్ని వెంటబెట్టుకుని వెళ్ళే హైక్లాసు పురుషుడిలా ఎక్కడాలేడు జానకిరామారావు.

'పుట్టింటి గాలి సోకగానే యిది మారిపోయిందే' అని విస్తుపోయి 'ఇది నాతో కాపురం చేసే సీతేనా కొత్త సీతా' అని క్షణకాలం తటపటాయించాడు. జానకి అందంలో తమాషా వుంది. పెళ్ళాం సొగసులు పరిచయ మాత్రంతో పసికట్టడం సాధ్యం కాదు. ఒకప్పుడు చేసుకున్న మొగుడికే చేసుకున్న పెళ్లాం వయ్యారం కంటగింపుగా వుంటుంది. 'దీని పొగరంతా దీని జడలో వుంది' అనుకున్నాడు గొప్ప డిస్కవరీ చేసినట్లు పెళ్లాన్ని పరీక్షగా చూస్తూ.

రైలాగినందుకు ప్లాట్‌ఫాం సందడిగా వుంది. అంతా చీకటే-స్టేషనూ ప్లాట్‌ఫాం కూడా చిన్నవే. కాని వచ్చి ఆగింది హౌరా ఎక్స్‌ప్రెస్ కావటం వలన గొప్పింటి చుట్టం వచ్చినపుడు ఎంత హడావిడిగా వుండాలో అంత హడావిడిగానూ వుంది తణుకు రైల్వే స్టేషన్. ఆ

